

ఇన్‌చార్జి కలెక్టర్‌గా మయూర్ అశోక్

విశాఖపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ మల్లికార్జునను ప్రభుత్వం రెండు రోజుల క్రితం బదిలీ చేసింది. తాత్కాలికంగా కలెక్టర్ బాధ్యతలు జేసీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కలెక్టర్ బాధ్యతల నుంచి మల్లికార్జున ఆదివారం రిలీవ్ కాగా... ఇన్‌చార్జిగా సోమవారం జేసీ బాధ్యతలు తీసుకున్నారు.



ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

అర్జీదారులతో ఆప్యాయంగా మాట్లాడండి

- వినతులను పూర్తిగా చదవండి, వారు చెప్పేది సావధానంగా వినండి
- సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపండి
- 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ప్రారంభ కార్యకమంలో అధికారులకు ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశం

విశాఖపట్నం/మహారాణిపేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులతో ఆప్యాయంగా మాట్లాడాలని, వారి సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ద్వారా వినతుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై వచ్చే ప్రజలతో సఖ్యతతో మెలగాలని, వినతులు పూర్తిగా చదవాలని, ఇంకా వారు చెప్పే అంశాలను సావధానంగా విని పరిష్కారం చూపాలని సూచించారు. అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించి ప్రజలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలన్నారు. వినతులను నిర్దీత సమయంలో పరిష్కరించాలని మయూర్ అశోక్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలుగా ప్రజల నుంచి వినతుల స్వీకరించలేదని, ఇకపై ప్రతి సోమవారం ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొంటూ అందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. తమ విభాగాల సిబ్బందిని కూడా అప్రమత్తం చేయాలన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై 237 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించినవి 79, జీవీఎంసీకి చెందినవి 52, పోలీస్ శాఖకు చెందినవి 24, ఇతర శాఖలకు చెందినవి 82 ఉన్నాయి. అర్జీల స్వీకరణ కార్యక్ర మంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ వర్మ, ఏసీపీ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్



శ్రీభరత్ అనే నేను...

- తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీ

విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ సోమవారం లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేశారు. 'మతుకుమిల్లి శ్రీభరత్ అనే నేను..' అంటూ ఆయన తెలుగులో ప్రమాణంచేసి తరువాత లోక్‌సభ రిజిస్టర్‌లో సంతకం చేశారు. లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెల్లచొక్కా దానిపై నల్లని ఆఫ్ కోట్ ధరించిన శ్రీభరత్ మెడలో పసుపు కండువా వేసుకున్నారు. -విశాఖపట్నం

టిడ్కో లబ్ధిదారులపై బ్యాంకుల ఒత్తిడి

రెండేళ్ల కిందట రుణాలు మంజూరు

- నిర్ణీత వ్యవధి పూర్తయినందున వాయిదాలు చెల్లించాలంటూ డిమాండ్
- తమకు అసలు ఇళ్లే అప్పగించనప్పుడు ఈఎంఐలు ఎలా కట్టగలమని ప్రశ్నిస్తున్న లబ్ధిదారులు
- సంక్షేమ పథకాల డబ్బును లాగేసుకుంటున్నారని ఆవేదన
- జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు



బక్కన్నపాలెం వద్ద టిడ్కో ఇళ్లు




బ్యాంకర్లు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్న లబ్ధిదారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"మాకు ఇంకా ఇళ్లు అప్పగించలేదు. అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నాం. కానీ బ్యాంకు అధికారులు మాత్రం ఇంటికి లోన్ తీసుకున్నారు కాబట్టి, నెలనెలా వాయిదాలు కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాల డబ్బు బ్యాంకులో పడగానే వాయిదాల కింద తీసేసుకుంటున్నారు. మాకు ఇళ్లు అయినా ఇవ్వండి, లేదా లోన్ వాయిదాల కోసం వేధించడమైనా ఆపండి." - ఇదీ టిడ్కో లబ్ధిదారుల ఆవేదన.

నగరంలో నిరుపేదల కోసం గతంలో తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో కింద ఇళ్ల నిర్మాణం చేపట్టింది. సంగివలస, బక్కన్నపాలెం, కొమ్మాది, దబ్బంద, అచ్చింనాయుడులోవ, ములగాడ, ట్రై జంక్షన్, దువ్వాడ, భానోజీతోట, అగనంపూడి, బర్మాకాలనీ, తలారివానిపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి, కొండకొప్పాక, సత్యనారాయణపురం, రాతిచెరువు, చినముషిడివాడ, చీమలపల్లి, పరవాడ, అప్పికొండ, నడుపూరు, లంకెలపాలెంతోపాటు సుద్దగెడ్డ, ఆదర్శనగర్, చిలకపేట, సీహార్స్ జంక్షన్, రాజీవ్ కాలనీ, పైడిమాంబకాలనీ, ముత్యాలమ్మకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, గౌరీనగర్, ఏఎస్ఆర్ నగర్ ...తదితర 31 చోట్ల 24,192 ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. 2019 మార్చి నాటికి వీటిలో దాదాపు నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తవ్వడంతో లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించేసింది. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ హయాంలో జరిగిన ఇళ్ల కేటాయింపును రద్దు చేసింది. తర్వాత మరోసారి సర్వే నిర్వహించి అర్హులుగా గుర్తించిన వారికి లాటరీ ద్వారా 24,192 ఇళ్లను కేటాయించింది. అయితే వైసీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం ముందుకుసాగలేదు. అయినప్పటికీ ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంక్ లింకేజీ ప్రక్రియను ప్రారంభించింది. బ్యాంకర్లపై ఒత్తిడి తెచ్చి మరీ రుణాలు మంజూరు చేయించింది. 300 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన ఇళ్లను ఉచితంగా కేటాయించగా, 360 చదరపు అడుగుల ఇంటికి రూ.3.15 లక్షలు, 430 చదరపు అడుగుల ఇంటికి రూ.3.65 లక్షలు రుణం కింద బ్యాంకులు

... మిగతా 6వ పేజీలో



కాంతులీనిన క్లాక్‌టవర్

- జగదాంబ కూడలికి స్పెషల్ అట్రాక్షన్

క్లాక్‌టవర్ కాంతులీనింది. జగదాంబ కూడలిలో నిర్మించిన క్లాక్‌టవర్‌కు అమర్చిన విద్యుత్ దీపాలను సోమవారం సాయంత్రం వెలిగించడంతో ఆ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఉదయం స్తంభానికి నలువైపులా అమర్చిన గడియారాలను ప్రారంభించారు. సాయంత్రానికి మిగిలిన పనులు పూర్తి చేసి విద్యుత్ దీపాలను వెలిగించడంతో క్లాక్‌టవర్‌ను చూసేందుకు జనం ఉత్సాహం చూపించారు. ప్రారంభోత్సవం జరిగిన తరువాత ప్రత్యేక గంటల శబ్దం నగరవాసులను కొత్త అనుభూతికి గురిచేయనుంది. - జగదాంబ కూడలి

ఏయూ వీసీ ఇష్టారాజ్యం

ఐదేళ్లలో 28కిపైగా కోర్సులు ఎత్తివేత

- ఆయా విభాగాల్లో పనిచేస్తున్న 250 గెస్ట్ ఫ్యాకల్టీ తొలగింపు
- ఆందోళన చేసినా పట్టించుకోని వైనం
- ఆ తరువాత కాలంలో కొన్నింటిని పునఃప్రారంభించినా ఎయిడెడ్ సిబ్బందితో నిర్వహణ





విశాఖపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి ఐదేళ్లు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఆయన వల్ల వందలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. వర్సిటీలో సుమారు 15, 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని వీసీ ప్రసాదరెడ్డి దశల వారీగా తొలగించి వారి పొట్ట కొట్టారు. దీనిపై నెలల తరబడి వారు పోరాటం సాగించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

ఏయూలో 2020-2023 మధ్యకాలంలో 28కిపైగా విభాగాల్లో పనిచేస్తున్న 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని వీసీ తొలగించారు. ఇందుకోసం ఆయా కోర్సులనే ఆయన ఎత్తేశారు. ఈ జాబితాలో అత్యంత డిమాండ్ ఉన్న కోర్సులు ఉండడం గమనార్హం. మీడియా స్టడీస్, డిప్లొమో ఇన్ జర్నలిజం, హ్యూమన్ రైట్స్ డిపార్టుమెంట్, ఆర్కియాలజీ, అగ్రికల్చర్ టెక్నాలజీ, హార్టికల్చర్, ఎమ్మెస్సీ ఎకనామెట్రిక్స్, ఇంటిగ్రేటెడ్ జియాలజీ, ఫుడ్ అండ్ డ్రగ్స్ ఎన్విరాన్‌మెంట్ కెమిస్ట్రీ, న్యూక్లియర్ కెమిస్ట్రీ, మెరైన్ కెమిస్ట్రీ, న్యూక్లియర్ ఫిజిక్స్, స్పేస్ ఫిజిక్స్, డిప్లమో ఇన్ యోగా, ఎమ్మెస్సీ ఫిషరీస్, ఎమ్మెస్సీ జియాలజీ సహా పలు కోర్సులు రద్దయిన వాటిలో ఉన్నాయి. ఆయా విభాగాల్లో కనీసం ఇద్దరు నుంచి ఆరుగురు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేవారు. వీరికి సెమిస్టర్ ప్రాతిపదికన వేతనాలు చెల్లించేవారు. సెమిస్టర్

... మిగతా 6వ పేజీలో

జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్

సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా... నేటి నుంచే పునఃప్రారంభం

- రైళ్ల రద్దుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఒక అడుగు వెనక్కి తగ్గిన అధికారులు
- సింహాద్రి, రత్నాచల్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు ఇంకా దక్కని ఊరట



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు డిమాండ్ పెంచుకోవడానికి సాధారణ ప్రయాణికులు ఎక్కువగా వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో రైల్వే శాఖ ఒక అడుగు వెనక్కి తగ్గింది. విజయవాడ డివిజన్‌లో భద్రతాపరమైన తనిఖీలు నిర్వహిస్తున్న కారణంగా జూన్ 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఎనిమిది జతల రైళ్లను రద్దు చేస్తున్నట్టు రెండు రోజుల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై 'రైల్వే రద్దుల పద్దు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించారు. ఆపరేషన్ల పేరుతో ఉన్నతాధికారులు రద్దు చేసిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో పాటు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఇవి జూన్ 25వ తేదీ అంటే మంగళవారం నుంచే ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805/12806) లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడుస్తుంది. అలాగే సర్కార్ ఎక్స్‌ప్రెస్ తమిళనాడులోని చెంగల్పట్టు నుంచి బయలుదేరి చెన్నై, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుతుంది. దీనిని కూడా పునరుద్ధరించారు. ఇంకా విశాఖపట్నం-గుంటూరు మధ్య సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-విజయవాడ మధ్య రత్నాచల్, విశాఖ-తిరుపతిల మధ్య డబుల్ డెక్కర్ రైళ్లను పునరుద్ధరించాల్సి ఉంది. వీటికి కూడా విపరీతమైన రద్దీ ఉంటుంది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల మధ్య తిరిగేవారు అత్యధికంగా ఈ రైళ్లనే ఆశ్రయిస్తారు. ఇవన్నీ కూడా వందేభారత్ రైలు బయలుదేరడానికి ఒక గంట అటుఇటుగా బయలుదేరేవి కావడం గమనార్హం. వీటిని రద్దు చేస్తే ఆ ప్రయాణికులు అంతా తప్పనిసరి స్థితిలో వందే భారత్‌ను ఆశ్రయిస్తారని, తద్వారా ఆక్యుపెన్సీ పెరిగి ఎక్కువ ఆదాయం వస్తుందనేది రైల్వే పెద్దల ఆలోచన. ఈ డిమాండ్‌ను చూపించి, అదనంగా మరికొన్ని వందేభారత్ రైళ్లు నడపాలన్నదే వారి ప్రణాళిక. గత ఏడాది జనవరి నుంచి సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఒక వందేభారత్ రైలు నడుస్తుండగా, మూడు నెలల క్రితం మరొకటి వేశారు. విజయవాడ-విశాఖపట్నం మధ్య కూడా వందే భారత్ ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే ఉద్యోగుల సమాచారం. తక్కువ రేటుతో సామాన్యులు ప్రయాణించే రైళ్లను క్రమంగా రద్దు చేసి, ఎక్కువ ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లను తమ బ్రాండ్‌తో ప్రమోట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇదంతా చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి.

ఎంపీలు ముందుకురావాలి

ప్రధానమైన రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లనే కాకుండా గుంటూరు-రాయగడ పాసింజర్ రైలు, ఇటు విశాఖపట్నం-గుణుపూర్

... మిగతా 6వ పేజీలో

భారత్ టీ20 జట్టులో నితీష్‌కుమార్‌రెడ్డి



విశాఖపట్నం (స్పోర్ట్స్), జూన్ 24: నగరానికి చెందిన యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి టీమిండియాలో చేరాడు. త్వరలో జింబాబ్వేతో జరగనున్న టీ20 సిరీస్‌కు బీసీసీఐ సోమవారం ప్రకటించిన భారత్ జట్టులో నితీష్‌కుమార్‌రెడ్డి చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన నితీష్ కుమార్‌రెడ్డి... పంజాబ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి ఓటమి దశలో ఉన్న జట్టుకు అనూహ్య విజయాన్నందించాడు. కాగా ఈనెల 30 నుంచి జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) వేలం పాటలో అత్యధికంగా రూ.15.6 లక్షలు ధర పలికిన క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

పెందుర్తిలో కలకలం

- అదీప్‌రాజ్ ఆస్పత్రిపాలు
- రకరకాలుగా ప్రచారం... ఖండించిన మాజీ ఎమ్మెల్యే



వీడియో విడుదల చేసిన అదీప్‌రాజ్

పెందుర్తి, జూన్ 24: పెందుర్తి మాజీ శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆస్పత్రిపాలవ్వడం నియోజకవర్గంలో కలకలం రేపింది. ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని సోషల్ మీడియాలో వార్తలు

... మిగతా 6వ పేజీలో

ఉక్కు కన్సల్టెంట్‌తో చిక్కు

- రిటైరైనా వదలని అధికారి
- ఆర్థిక సలహాదారుగా కొనసాగింపు
- నెలకు రూ.లక్షన్నర గౌరవ వేతనం
- ఉన్నతాధికారులతో కలిసి ఢిల్లీ, ముంబై పర్యటనలు
- ఉద్యోగ, కార్మిక సంఘాల అభ్యంతరం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఆర్థిక స్థితి బాగా లేదు. ప్రతి రూపాయిని ఆచితూచి ఖర్చు చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో రిటైరైన వారిని కన్సల్టెంట్ల పేరుతో కొనసాగిస్తూ వారికి నెల నెలా లక్షల రూపాయల్లో జీతాలు ఇస్తున్నారు. వారి వల్ల సంస్థకు ఒరిగిందేమీ లేదని ఉద్యోగులు, కార్మికులు పేర్కొంటున్నారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఎవరైనా రిటైరైతే వారికి బెనిఫిట్స్ ఇచ్చి పంపించేస్తారు. సీబీఐ కేసులు వంటివి ఉంటే సెటిల్‌మెంట్ ఆలస్యమవుతుంది. కానీ ఫైనాన్స్ విభాగంలో డైరెక్టర్ స్థాయిలో పదవీ విరమణ చేసిన ఓ ఉన్నతాధికారిని ఇప్పటికీ 'సలహాదారు' పేరుతో కొనసాగిస్తున్నారు. రాచమర్యాదలు చేస్తున్నారు. ఆయన వచ్చినప్పుడల్లా నామమాత్రపు ధరకే హిల్ టాప్ గెస్ట్ హౌస్ ఇస్తున్నారు. వాహనం సమకూర్చారు. అన్నీ కలిపి నెలకు రూ.2 లక్షల వరకు ముట్టజెబుతున్నారు. ఇతర అధికారులను పక్కన పెట్టి రిటైరైన వ్యక్తి నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వడాన్నే అంతా తప్పుబడుతున్నారు. ప్లాంటులో 2019లో అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చిన వ్యవహారంలో ఆయనపై సీబీఐ చార్జిషీట్ ఉంది. అయినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా ఇచ్చేశారు. ఆయన కంటే ముందు పదవీ విరమణ

... మిగతా 6వ పేజీలో

సమస్యలపై నర్సుల స్ట్రగుల్ కమిటీ వినతి



వంశీకృష్ణకు వినతి పత్రమిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, జూన్ 24: అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని నర్సుల స్ట్రగుల్ కమిటీ నాయకులు దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కోరారు. సోమవారం కాంట్రాక్ట్ నర్సింగ్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి శుభాభినందనలు తెలిపారు. అనంతరం వారి సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సూర్యకళ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి రాష్ట్రంలో నిరుద్యోగులకు ఊరటకలిచిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని తమకూ నారా లోకేశ్ హామీ ఇచ్చారని, ఈ స్థితిలో తమను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు ఈ సమావేశంలో స్టాఫ్ నర్సు శాం తమ్మ, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు రవి, అరుణకుమారి, జ్యోత్స్న, వెంకటదుర్గ, కరుణ, వై. దుర్గ, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవో



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

అక్కయ్యపాలెం, జూన్ 24: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రాన్ని సోమవారం సీతమ్మధార మండలం ఎంఈవో రామారావు సందర్శించారు. ఈ మేరకు వారు దివ్యాంగ విద్యార్థులకు ఏ విధంగా విద్య అందుతుందోనని వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, గీత, ఉపాధ్యాయులు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ వాల్ పనులను వేగవంతం చేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారావు

కంచరపాలెం, జూన్ 24 : జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాలైన నీలకంఠనగర్, రామకృష్ణ నగర్, కొండదేవత గుడి తదితర ప్రాంతాలకు రక్షణగా చేపడుతున్న రిటర్నింగ్ వాల్ పనులను వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు సోమవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరకుండా వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. 40 ఏళ్లుగాబాధిత గ్రామాల ప్రజలు రిటర్నింగ్ వాల్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వీరికిత్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



మహిళను అప్పగిస్తున్న ఏయూటీడీ సెక్రటరీ వాసు

డాబాగార్డెన్స్, జూన్ 24: నిరాశ్రయురాలైన శ్రీకాకుళానికి చెందిన పూజ (28)ను ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చినట్టు ఏయూటీడీ సెక్రటరీ వాసు తెలిపారు. మద్యానికి బానిసై 2016 సంవత్సరం నుంచి రోడ్లపై తిరుగుతున్న ఆమెను ఆదివారం రాత్రి టూ టౌన్ మహిళా ఏఎస్ఐ కాంతం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ వద్ద ఆమెను అదుపులోకి తీసుకున్నారు. పారిపోయే ప్రయత్నంలో తనచేతికి గాయం చేసుకున్నట్టు తెలిపారు. దీంతో టీఎస్సార్ వుమెన్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించి, సోమవారం ఆ మహిళ కుటుంబ సభ్యులను రప్పించి అప్పజెప్పినట్టు ఆయన తెలిపారు. తిరిగి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించినట్టు తెలిపారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

▸▸ వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తా..: సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ

అక్కయ్యపాలెం, జూన్ 24: నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 42వ వార్డుకు సంబంధించిన 233, 234 నెంబర్లు గల సచివాలయాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్, సచివాలయాల కార్యదర్శులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వార్డుల్లో సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అకిరెడ్డి జగదీష్ మాట్లాడుతూ వార్డులోని ఇందిరా కాలనీలోని వారికి సామాజిక మరుగుదొడ్లు లేవన్నారు. అలాగే రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, వీటితో పాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, టీడీపీ, బీజేపీ వార్డు అధ్యక్షులు కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్, నాయకులు దువ్వి కాశీప్రసాద్, శ్రీకృష్ణ, ఎంఎల్ఎన్ రావు, జేకే, తోట శ్రీదేవి, శ్రీవేణి, బంగారి నవీన్, ఆర్పీలు ఎస్.ఆలివేణి పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరం అందేలా సిబ్బంది పని చేయాలని ఎమ్మెల్యే వంశీ కృష్ణ ఆదేశించారు. సోమవారం గ్రేటర్ 38 వార్డు పరిధిలోని బురుజుపేట సచివాలయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సచివాలయాలకు వచ్చే వినతులు పరిష్కరించాలని కోరారు. నియోజవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్- 4 కమిషనర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న వంశీకృష్ణ శ్రీనివాస్

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న వంశీ కృష్ణ

జగదాంబ కూడలి: ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీసమేతంగా కనకమహాలక్ష్మి అమ్మవారిని సోమవారం ఉదయం దర్శించుకున్నారు. పూర్ణకుంభం, మేళతాళాలతో ఆయనకు అర్చకులు, ఈవో శ్రీనివాసుల రెడ్డి స్వాగతం పలికారు. గర్భగుడిలో అమ్మవారికి పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు. అమ్మవారి ప్రతిమ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూఅమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు గోడి నరసింహాచారి, త్రినాధ్, కేధారి లక్ష్మి, జనసేన నాయకులు బుద్దల అనురాధ దేవస్థానం ఇంజనీర్ రమణ, మూర్తి, సహాయకార్యనిర్వహణాధికారి వి. రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు

జ్ఞానాపురం, జూన్ 24: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక నిర్వహించి వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి 3, పట్టణప్రణాళికా విభాగానికి 3 చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ టి. ఎస్. ఎన్. రాజు, ఈఈలు మృత్యురాజు, తారా ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, టీపీఓ విజయ్‌కుమార్, వైద్యాధికారి సునీల్ కుమార్, ఆర్వోలు బాబురావు, రాజేశ్వరి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో..



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ ఆర్.జి.వి కృష్ణ



దరఖాస్తు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులు పరిష్కారించే దిశలో చర్యలు చేపడతామని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ శ్రీరామమూర్తి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ఈ వేదికలో పలువురినుంచి వినతులు స్వీకరించారు. 2014లో ఇచ్చిన సర్వే సర్టిఫికెట్‌లో అవతకవకలు ఉన్నట్టు ఒకరు ఫిర్యాదు చేయడంతో పరిశీలించి సమస్య పరిష్కారిస్తామన్నారు.



రామకృష్ణానగర్ రోడ్డు మధ్య తవ్విన గొయ్యి



అక్కయ్యపాలెంలో.....

విచ్చలవిడిగా రోడ్లు తవ్వకాలు... రాకపోకలకు అవస్థలు

▸▸ అక్కయ్యపాలెం పరిసరాల్లో సమస్య.. పనుల్లో జాప్యంతో తంటాలు

అక్కయ్యపాలెం, జూన్ 24 : అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో రోడ్లను ఇష్టానుసారం తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్లు వేసేందుకు రామకృష్ణానగర్ ఇతరప్రాంతాల్లో రోడ్లను తవ్వకాలు చేపట్టారు. రోజులకొద్దీ పనులు చేయకపోవడం వల్ల తవ్విన గోతులు అలాగే ఉండిపోతున్నాయి. దీంతో తాము గమ్యానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి వెళ్ళాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. గోతులను రాత్రి వేళల్లో చూసుకోకుండా వెళ్లి వాటిలో పడి పలువురు గాయాలపాలవుతున్నారు. ఇలాంటి నిర్వహణ పనులు సత్వర చర్యలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

మహారాణిపేట, జూన్ 24: ప్రభుత్వ ఆస్పత్రుల్లో థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విశాఖపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఈమేరకు కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో ప్రకారం కార్మికునికి రూ. 16 వేల వేతనం అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐలు చెల్లింపులో వ్యత్యాసం లేకుండా చూడాలని కోరారు. కార్మికులపై పనిభారం పెంచడం తగదన్నారు. కాంట్రాక్టర్లు పాల్పడుతున్న కక్ష్య సాధింపు చర్యలను నిరోధించాలని కోరారు. విమ్స్, టీబీహెచ్ , మానసిక వైద్యశాలలకు చెందిన వర్కర్స్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు వితరణ

అల్లిపురం, జూన్ 24: చిరువ్యాపారులకు దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు పార్టీ కార్యాలయం వద్ద సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. ఎండా, వర్షంలలో రక్షణగా వ్యాపారులకు వీటిని అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఆదిబాబు, కిషోర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన లైఫ్‌గార్డులు

మహారాణిపేట, జూన్ 24: సముద్రంలో మునిగిపోతున్న మహిళను లైఫ్‌గార్డులు కాపాడారు. సీమ్మధార ప్రాంతానికి చెందిన వి. ప్రవల్లిక (22) ఆమె భర్త అప్పారావుతో కలసి ఆటవిడుపుగా సోమవారం ఆర్‌కే బీచ్‌లో వద్దకు వచ్చి సముద్రంలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో తీరంలో అలల తాకిడికి ప్రవల్లిక లోనికి కొట్టుకుపోయారు. వెంటనే అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్‌గార్డులు కల్యాణ, వెంకటేష్, ధనరాజు చేరుకుని ఆమెను కాపాడారు.

ఆది శంకరాచార్యులు శివుని అవతార రూపం

అక్కయ్యపాలెం, జూన్ 24: ఆది శంకరాచార్యులు సాక్షాత్తు శివుని అవతార రూపమని కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితా పీఠంలో ప్రవచన కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది. స్వామివారు జగద్గురు శంకరవిజయం అనే అంశంపై అనుగ్రహ భాషణం చేశారు. శంకరుల అవతరణ నాటి కి భారతావనిలో ఉన్న ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జపతప హోమాలను తెలిపారు. శంకరులు అద్వైత సిద్ధాంత ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్రవాఙ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారన్నారు. వారి కవిత్వం బోధనల ప్రభావం నేటికి సమాజంపై ఉందని తెలిపారు. శంకరుల జీవితంలోని పలుఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.



అనుగ్రహణ భాషణ చేస్తున్న సిద్ధేశ్వరానందస్వామి

ఏటీఎల్ లక్ష్య సాధనలో హెచ్‌ఎంలది కీలకపాత్ర: డీఈవో



వర్క్‌షాప్‌లో హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న డీఈఓ చంద్రకళ తదితరులు

వేపగుంట, జూన్ 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) లక్ష్యాలను విద్యార్థులకు చేరవేయడంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని డీఈఓ చంద్రకళ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్‌కు శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 30 పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులల్లో సైన్స్ ప్రాజెక్ట్‌లపై అవగాహన పెంపొందించాలన్నారు. వారి భవిష్యత్తు అభిప్రాయాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా వారిని సిద్ధం చేయాలని కోరారు. అలాగే, సైన్స్ ఎగ్జిబిషన్‌లో జరిగే ప్రతీ ఈవెంట్‌లో ఏటీఎల్ విద్యార్థులు పాల్గొనేలా హెచ్‌ఎంలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, కిషోర్, వెంకటేష్, హేమ, జిల్లా సైన్స్ అధికారి కె. ప్రసాద్, వేపగుంట హెచ్‌ఎం పద్మావతి, ఏపీసీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు

▸▸ ముమ్మరంగా వాహన తనిఖీలు

▸▸ నెక్స్ జెన్ ఎం పరివాహన్ సిటిజన్ యాప్‌లో జరిమానాల వసూలు

సీతంపేట, జూన్ 24: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమణ, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, పాత చలానాల బకాయిలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నాయి. సిగ్నల్ జంపింగ్, నో హెల్మెట్, ట్రిబుల్‌రైడింగ్ ఇలా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి ఈ చలనాలు విధించే వారు. అయితే, వీటిని వాహనదారులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. అటువంటి వారి వద్ద నుంచి వారి మొబైల్‌లోనే జరిమానా చలానాలు చెల్లించేలా నెక్స్‌జెన్‌ఎం పరివాహన్ సిటిజన్ యాప్ ద్వారా అనుసంధానిస్తున్నారు. ద్వారకా ట్రాఫిక్ సర్కిల్ పరిధి ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ కేఎస్ఎస్వీ ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ భాస్కరరావు ప్రత్యేక డ్రైవ్ ద్వారా వాహనదారులతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి జరిమానాలు కట్టిస్తున్నారు. గురుద్వార కూడలి, సీతమ్మధార కూడలి, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. వాహనాల పాత చలనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..: సీఐ

వాహనదారులు తప్పనిసరిగ్గా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ కేఎస్ఎస్వీ ప్రసాద్ తెలిపారు. ప్రత్యేక యాప్‌తో పాత ఈ చలనాలు, జరిమానాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



గురుద్వార జంక్షన్‌లో జరిమానా కట్టిస్తున్న పోలీసులు

పశ్చిమ గోదావరిపై విశాఖ భారీ ఆధిక్యం

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూన్ 24: రాష్ట్ర స్థాయి అండర్-16 క్రికెట్ టోర్నీలో విశాఖ ఆటగాళ్లు కదం తొక్కారు. నరసారావుపేటలో పశ్చిమ గోదావరితో జరుగుతున్న మల్టి డే మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 349 పరుగుల ఆధిక్యత సాధించారు. టాస్ గెలిచి తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన పశ్చిమ గోదావరి 27.1 ఓవర్లలో కేవలం 42 పరుగులకే కుప్పకూలింది. విశాఖ బౌలర్ కే గౌతమ్ ఆర్య ఆరు వికెట్లు తీసి పశ్చిమ గోదావరి బ్యాటర్లను పెవిలియన్ దారి పట్టించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన విశాఖ తొలి రోజు ఆట ముగిసే సరికి 60 ఓవర్లలో రెండు వికెట్లకు 391 పరుగుల భారీ స్కోరు చేసింది. కే భాను శ్రీహర్ష వీరవిహారం చేసి డబుల్ సెంచరీ (209; 29 బౌండరీలు, 7 సిక్సర్లు) సాధించగా, పి.ధీరజ్ భారీ సెంచరీ (157; 22 బౌండరీలు, 2 సిక్సర్లు) చేసాడు. పశ్చిమ గోదావరి బౌలర్లు ఏ దశలోనూ భాను శ్రీహర్ష, ధీరజ్‌లను నిలువరించలేకపోయారు.

నైపుణ్య గణనకు ప్రాధాన్యమివ్వాలి ; కాంగ్రెస్

మురళీనగర్, జూన్ 24 ; ఏడీఏ ప్రభుత్వం రాష్ట్రంలో యువత సహా అన్ని వర్గాల నైపుణ్య గణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల.వెంకటరావు కోరారు. కుల గణన కంటే ముందుగా దీనికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ అవసరాలను అందుకోవాలంటే, జనాభాకు ఉన్న నైపుణ్యాలను సమర్థంగా అంచనా వేయాల్సి ఉందన్నారు. మొత్తం శ్రామికశక్తి నైపుణ్యాలను, సామర్థ్యాలను సమగ్ర సమాచారం సేకరణతో విధాన రూపకర్తలు సరైన నిర్ణయాలు తీసుకునే వీలుంటుందని అన్నారు. ప్రపంచంలో ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ తదితర దేశాలు అగ్రస్థానాల్లో ఉండటానికి కారణాలు ఇవే అని అన్నారు. ఈ కార్యక్రమంతో ఉత్తమ విద్య వృత్తి శిక్షణకు దారితీస్తుందని అన్నారు.

ఏయూ వీసీ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

సిలబస్ పూర్తిచేస్తే రూ.45 వేలు వేతనంగా చెల్లించేవారు. ఒక్కో సెమిస్టర్ పూర్తి చేయడానికి 90 రోజులు సమయం పడుతుంది. అంటే నెలకు కేవలం రూ.15 వేలు చొప్పున లభించేది. అయినప్పటికీ ఉద్యోగ భద్రత ఉంటుందన్న ఉద్దేశంతో ఎంతో మంది సంవత్సరాల తరబడి పనిచేస్తురు. వీసీ ఒకే ఒక్క కలంపోటుతో వారి జీవితాలను రోడ్డునపడేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తొలగింపునకు గురైన గెస్ట్ ఫ్యాకల్టీ ఇప్పటికీ వర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు. తొలుత కోర్సులను ఎత్తేసిన అధికారులు...ఆ తరువాత కాలంలో కొన్నింటిని మళ్లీ ప్రారంభించారు. అయితే గెస్ట్ ఫ్యాకల్టీని మాత్రం తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలోకి తెచ్చిన ఎయిడెడ్ ఫ్యాకల్టీ, ఇతరులతో ఆయా కోర్సులను నిర్వహిస్తున్నారు.

ఎత్తేయడానికి కారణం అదే..

అడ్మిషన్లు తగ్గాయని, ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజులో కోత విధించిందంటూ కారణాలను చూపించి అధికారులు దశల వారీగా పలు కోర్సులను ఎత్తేశారు. ఆయా కోర్సులు ఎత్తేసిన తరువాత గెస్ట్ ఫ్యాకల్టీతో అవసరం లేదంటూ వారిని తొలగించారు. కొన్ని నెలల తరువాత ఎత్తేసిన కొన్ని కోర్సులను మళ్లీ పునః ప్రారంభించారు. దీనికి మీడియాలో పెద్దఎత్తున కథనాలు రావడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. అయితే, తొలగించిన గెస్ట్ ఫ్యాకల్టీని మాత్రం అధికారులు మళ్లీ విధుల్లోకి తీసుకోలేదు. ఆదాయం బాగా వచ్చే కోర్సులను మాత్రమే వర్సిటీలో పెట్టారు. దీనివల్ల సాధారణ, నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అదేవిధంగా ఏళ్ల తరబడి పనిచేస్తూ వచ్చిన ఉద్యోగులు రోడ్డునపడ్డారు.

పెందుర్తిలో కలకలం

... 5వ పేజీ తరువాయి

హల్‌చల్ చేయడంతో పెందుర్తి ఉలిక్కిపడింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఆదివారం రాంపురంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గ స్థాయి పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అందరికీ వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో తెల్లవారేసరికల్లా ఆయన ఆస్పత్రిలో ఉన్నారని వార్తలు రావడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై రకరకాల కథనాలు ప్రచారం జరగడంతో సోమవారం సాయంత్రం ఆయన వీడియో విడుదల చేశారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలు సమయంలో గ్యాస్ట్రిక్ పెయిన్ రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఆస్పత్రిలో చేర్పించారని, ప్రస్తుతం తాను డిశ్చార్జి అయ్యి ఆరోగ్యంగానే ఉన్నానని పేర్కొన్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడని విష ప్రచారం చేశారని అవన్నీ అవాస్తవాలన్నీ కొట్టిపారేశారు.

ఉక్కు కన్సల్టెంట్‌తో చిక్కు

... 5వ పేజీ తరువాయి

చేసిన వారికి ఇంకా ఫైనల్ సెటిల్‌మెంట్ పెండింగ్‌లో ఉండగా ఈయనకు మాత్రం అన్నీ క్లియర్ చేసేశారు. ఫైనాన్స్ విభాగంలో పనిచేయడం వల్ల కీలక సంస్థలు, వ్యక్తులతో సంబంధాలు పెట్టుకొని సొంతంగా లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాంటు కష్ట పరిస్థితుల్లో ఉన్నందున ఉద్యోగులు, కార్మికులకు జీతాలు ఆపాలని సలహా ఇచ్చిందేకూడా ఆయనేనని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి.

ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఆయన పదవీ విరమణ చేసిన తరువాత ఆ పోస్టు చాలాకాలం ఖాళీగా ఉంచారు. వాస్తవానికి స్టీల్‌ప్లాంటులో డైరెక్టర్ స్థాయి పోస్టు ఖాళీ అవుతుంటే మూడు నెలల ముందుగానే రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించి, సరైన అధికారిని ఎంపిక చేస్తారు. ఈయన విషయంలో అలా చేయలేదు. రిటైరయ్యాక ఆ పోస్టు భర్తీ చేయకుండా సుమారు ఎనిమిది నెలలు ఖాళీగా ఉంచేశారు. ఫైనాన్స్ విభాగాన్ని సీఎండీ కొన్నాళ్లు, పర్సనల్ డైరెక్టర్ కొన్నాళ్లు అదనపు బాధ్యతల కింద చూసుకున్నారు. ఆ సమయంలో సదరు రిటైర్డ్ అధికారి వారి ఛాంబర్లలోనే కూర్చుని ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్-3ను జిందాల్‌కు ఇస్తే ప్లాంటు కష్టాలన్నీ తీరిపోతాయని చెప్పి, వారికి అనుకూలంగా నిర్ణయం వచ్చేలా చేసింది ఈయనేనని, ఇప్పుడు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా రెండు నెలల క్రితం పూర్తిస్థాయి ఫైనాన్స్ డైరెక్టర్‌ను నియమించారు. అదే విభాగంతో డైరెక్టర్ అయ్యేంత అనుభవం ఉన్న చీఫ్ జనరల్ మేనేజర్ ఉన్నారు. అయినప్పటికీ సదరు అధికారిని కన్సల్టెంట్‌గా కొనసాగిస్తున్నారు. ఇది దుబారా వ్యయం కిందికే వస్తుందని, తక్షణమే సలహాదారులను సేవలు నిలిపివేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఇటీవల ప్లాంటు ఆర్థిక స్థితిపై చర్చించడానికి ఉన్నతాధికారుల బృందం ఢిల్లీకి, బ్యాంకర్లతో రుణాల కోసం చర్చించడానికి ముంబై వెళ్లింది. వారితో పాటు ఈయన్ను కూడా తీసుకువెళ్లారు. ఆయనకు సీఎండీ ఎందుకు అంత ప్రాధాన్యం ఇస్తున్నారో ఉద్యోగ, కార్మిక సంఘాలకు అంతుబట్టడం లేదు.

టిడ్కో లబ్ధిదారులపై బ్యాంకుల ఒత్తిడి

... 5వ పేజీ తరువాయి

మంజూరుచేశాయి. ఈ రెండు కేటగిరీలకు చెందిన 11,575 ఇళ్లకు బ్యాంకులు రెండేళ్ల కిందటి నుంచి దశల వారీగా లోన్ మంజూరుచేశాయి. లోన్ మంజూరైన రెండేళ్ల తర్వాత లబ్ధిదారులు నెలవారీ వాయిదాలను చెల్లించాల్సి ఉంటుందని ముందే నిబంధన విధించాయి. రూ.3.15 లక్షలు రుణం తీసుకున్నవారు నెలకు రూ.3 వేలు, రూ.3.65 లక్షలు రుణం తీసుకున్నవారు నెలకు దాదాపు రూ.3,600 ఈఎంఐ కింద చెల్లించాలి. రుణాలు మంజూరు చేసిన తర్వాత జీవీఎంసీ అధికారులు తమ పని అయిపోయిందన్నట్టు చేతులు దులిపేసుకున్నారు. కానీ టిడ్కో అధికారులు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వకకపోవడంతో సమస్య మొదలైంది. ఇంతవరకూ కేవలం 7,500 మందికి మాత్రమే ఇళ్లను అప్పగించారు. ఈలోగా లబ్ధిదారుల్లో కొందరికి బ్యాంకు నుంచి రుణాలు మంజూరై రెండేళ్లు పూర్తయిపోయింది. దీంతో వారు తీసుకున్న లోన్‌కు ఈఎంఐలు కట్టాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించారు. తమకు ఇళ్లు ఇంకా అప్పగించనందున తాము ఈఎంఐ కట్టలేమని లబ్ధిదారులు చెబుతున్నారు. తాము ఒక వైపు ఇంటి అద్దెలు కడుతూ, టిడ్కో ఇళ్లకు వాయిదాలు ఎలా కట్టగలమని బ్యాంకర్లను ప్రశ్నిస్తున్నారు. అయితే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల వివరాలన్నీ బ్యాంకర్ల వద్ద ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాగానే బ్యాంకులు ఆ మొత్తాన్ని తమ వాయిదాల కింద లాగేసుకుంటున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులకు లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తే తాము చేయగలిగిందేమీ లేదంటూ చేతులెత్తేస్తున్నారు. ఇదే విషయమై కొమ్మాది లేఅవుట్‌లో ఇళ్లు పొందిన కొంతమంది లబ్ధిదారులు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సాయికాంత్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన యూసీడీ అధికారులను పిలిచి తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బాధితులు మీడియాకు తమ గోడును వెల్లబోసుకున్నారు.

జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్

... 5వ పేజీ తరువాయి

రైళ్లను కూడా రద్దు చేశారు. అటు విజయవాడ నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఎంపీలు రైళ్ల రద్దు సమస్యను సీరియస్‌గా తీసుకొని, సామాన్య ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే దీనిపై ప్రతి ఎంపీ గొంతు విప్పాల్సిన అవసరం ఉంది.

టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారుల నిరీక్షణ

మల్కాపురం, జూన్ 24: పారిశ్రామిక ప్రాంతం అచ్చినాయుడు తోటలో పచ్చని కొండల మధ్య నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను తమకు ఎప్పుడు కేటాయిస్తారా అని లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఒకప్పుడు ఇక్కడ మామిడి, జీడి తోటలు ఉండేవి. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం పేదలకు మంచి వాతావరణం మధ్య ఇళ్లను నిర్మించి ఇవ్వాలని భావించి ఇక్కడ టిడ్కో గృహ సముదాయాలకు శ్రీకారం చుట్టింది. అయితే అప్పట్లో కొండల మధ్య ఇళ్లేంటి అని పలువురు విమర్శలు చేసినా ఇప్పుడు మాత్రం ఆహ్లాదకర వాతావరణంలో గృహాలున్నాయని అంటుండడం గమనార్హం. అప్పటి ఎమ్మెల్యే గణబాబు ఈ ప్రాంతాన్ని టౌన్‌షిప్‌గా తయారుచేయాలని 3,900 ఇళ్లను నిర్మించి, లబ్ధిదారులకు కేటాయించారు. ఈలోగా ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఐదేళ్లపాటు ఆ ఇళ్లు అలానే ఉండిపోయాయి. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం ఇక్కడి ఇళ్లను మళ్లీ లబ్ధిదారులకు కేటాయించి హడావిడిగా గృహ ప్రవేశాలను కూడా చేయించింది. అయితే ఇళ్ల తాళాలను మాత్రం లబ్ధిదారుల చేతికి ఇవ్వలేదు. ఇంతలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చింది. దీంతో లబ్ధిదారులు ఇకనైనా తమకు ఇళ్లను కేటాయించి అప్పగిస్తారని ఎంతో ఆశగా నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో కలిసి అచ్చినాయుడుతోటలో పర్యటించి, గృహ సముదాయాలకు మౌలిక వసతులు కల్పించడంపై దృష్టిసారించారు. ఇక్కడి టిడ్కో ఇళ్లకు త్వరితగతిన విద్యుత్, తాగునీటి వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక కొండ దిగువ నుంచి గృహ సముదాయాల వరకు ఉన్న సుమారు రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని గణబాబు సూచించారు.


అచ్చినాయుడు తోటలో టిడ్కో ఇళ్ల సముదాయం

అచ్చినాయుడుతోటలో 2014లోనే పూర్తయిన 3,900 గృహాల నిర్మాణం

పదేళ్లయినా ప్రజలు దిగని వైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చిగురించిన ఆశలు


అచ్చినాయుడు తోటకు ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డు

వసలుతు కల్పించాక అందుబాటులోకి..



విశాఖలోనే ఇంత అందమైన ప్రదేశం ఎక్కడ లేదు. అంత అందమైన లోకేషన్‌లో టిడ్కో ఇళ్లు నిర్మించాం. ఇదో మోడ్రన్ ప్రాంతంగా ఉంటుంది. వందేళ్లు గడిచినా ఇక్కడ ఇళ్లకు చిన్న డామేజీ కూడా ఉండదు. అంత పటిష్ఠంగా ఇళ్లు కట్టడం జరిగింది. ఇక్కడ మంచి రోడ్లు, అందమైన పార్కులు, ఇతర వసతులను కల్పించాక ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. ఆయా పనులన్నీ త్వరలోనే ప్రారంభమవుతాయి.

-పి.గణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే


పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

వీవీవీ స్కూల్‌ను యథావిధిగా నడపాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 24: స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయాన్ని యథావిధిగా నడపాలని, ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉపాధ్యాయులు స్కూల్ వద్ద ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు విద్యార్థుల తల్లిదండ్రులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్కూల్‌ను మూసివేసి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయవద్దని, ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించి న్యాయం చేయాలన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని, వీరికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మల్కాపురం, జూలై 24: తమకు సకాలంలో జీతాలకు ఇవ్వడం లేదని శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి సిబ్బంది ఎమ్మెల్యే గణబాబుకు పారిశ్రామిక ప్రాంతం టీడీపీ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. నెలల తరబడి జీతాలు అందక పోవడంతో కుటుంబాలతో ఇబ్బంది ఎ దుర్కొంటున్నట్టు పేర్కొన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సౌకర్యాలు అందేలా చూడాలని వారు అభ్యర్థించారు.

శ్రమదానంతో పిచ్చిమొక్కలు తొలగింపు

పెదగంట్యాడ, జూన్ 24: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ వాకింగ్ ట్రాక్‌లో పెరిగిన పిచ్చిమొక్కలను సోమవారం ఉదయం వాకర్స్ శ్రమదానం చేసి తొలగించారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, వృద్ధులు, క్రీడాకారులు శ్రమదానం చేశారు. వాకింగ్ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో వాకర్స్ శ్రమదానం చేసి వాటిని తొలగించారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒంఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 64, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారెట్ 38, దొండకాయలు 28, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 150, అల్లం (పాతది) 160, బరబటి 58, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 38, కీరదోస 38, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 28, క్యాప్సికమ్(?) కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఉక్కు కర్మాగారం పరిరక్షణే ప్రధాన లక్ష్యం

టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, జూన్ 24: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎన్డీఏ కూటమి ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు స్వాగతించారన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్మికుల సమస్యలతో పాటు అన్ని వర్గాల ప్రధాన సమస్యలపై కూటమి విశ్లేషణ చేసి పరిష్కరించే దిశగా ముందుకు సాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు గంధం వెంకటరావు, కోగంటి లెనిన్‌బాబు, రామ్మోహన్‌కుమార్, లక్ష్మణరావు, నమ్మి సింహాద్రి, కొమ్మినేని శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న ఎన్డీఏ కూటమి ట్రేడ్ యూనియన్ నాయకులు

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటును ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని హెచ్ఎంఎస్ ఉక్కు అధ్యక్షుడు డొమ్మేటి అప్పారావు కోరారు. బిలాయ్ స్టీల్ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన స్టీల్ మెటల్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, అందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఉక్కు యాజమాన్యమే కారణమన్నారు. నూతన వేతనాలు అమలు చేయకపోగా ఇవ్వాల్సిన జీతాలను కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఫెడరేషన్ ప్రతినిధులు తక్షణమే కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు, స్టీల్‌ప్లాంట్ సీఎండీకి లేఖలు రాసి కార్మికులకు వేతనాలను సకాలంలో చెల్లించేలా ఒత్తిడి తేవాలని కోరారు.

పోరాటాలతోనే ప్లాంట్ పరిరక్షణ సాధ్యం

కూర్మన్నపాలెం: కార్మికుల ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,229వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరి అజెండా ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చేయడమేనన్నారు. ఎంతోమంది త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలను భాగస్వాముల్ని చేసుకుని ముందుకు వెళతామన్నారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేయకుండా ప్రజా సంక్షేమ పాలనను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. నాయకుడు జె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంటును ఎలా కాపాడాలో యోచించకుండా ప్రభుత్వం అమ్మకాల వైపు దృష్టిసారించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


ఆలయంలోని 18 మెట్లపై వెలుగుతున్న దీపాలు, ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

అక్కిరెడ్డిపాలెం, జూన్ 24: షీలానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ 34వ పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం పడిపూజను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. అయ్యప్ప స్వామిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలోని 18 మెట్లను రంగవల్లులు, పుష్పాలతో అలంకరించి వాటిపై దీపాలను అమర్చి వెలిగించారు. గురుస్వామి అదపాక వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులు అయ్యప్ప కీర్తనలను ఆలపించగా, ప్రధాన అర్చకులు కృష్ణన్ నంబూద్రి నేతృత్వంలో వేదపండితులు స్వామివారి పడిపూజను వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీవీ శేషగిరిరావు, ఎస్ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శత శాతం అక్షరాస్యతకు కృషి చేయాలి

పెదగంట్యాడ, జూన్ 24: శత శాతం అక్షరాస్యత సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎంఈవో ఈ.శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాప్రవేశ కార్యక్రమాన్ని సోమవారం దుర్గవానిపాలెం ఎంపీపీ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని జూలై 25 వరకు జరుగుతుందని, బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో ఉండేందుకు అందరి సహకారం తీసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.రమణాజీ, హెచ్ఎం సుశీల, ఉపాధ్యాయుడు ప్రసాద్, సచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి 'నేను బడికి పోతా' ర్యాలీని నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

కూర్మన్నపాలెం, జూన్ 24: ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం-పర్యావరణాన్ని పరిరక్షిద్దామని శిష్టకరణాల అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శేఖరమంత్రి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు అందరూ నడుం బిగించాలన్నారు. కాలుష్య నివారణకు విధిగా మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి, సంఘం ప్రతినిధులు గంగవరం గోపి, డి.సత్యారావు, రమేశ్, వరలక్ష్మి, కృష్ణ, కిశక్షర్, ప్రశాంత్, పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు

ప్రజల విశ్వాసం చూరగొనాలి: ఎమ్మెల్యే గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 24: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా టీడీపీ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గౌరీనగర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యకర్తల అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సమష్టిగా పనిచేసి కూటమి విజయానికి ఎంతో శ్రమించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డుల్లోని సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.తిరుమలరావు, వార్డు అధ్యక్షుడు ఎం.వాసుదేవరావు, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకుమహంతి చంద్రశేఖర్, బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాళ్ల అశోక్‌కుమార్; శరత్ చంద్రన్‌బాబు, సూర్యనారాయణ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.10 లక్షల విరాళం

సింహాచలం, జూన్ 24: వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు రూ.10 లక్షలను విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అన్నప్రసాద విభాగం ఇన్‌చార్జి ఏఈవో పి.నరసింగరావుకు సోమవారం అందజేశారు. తన సోదరుడు నెక్కింటి వెంకటరత్నం పేరిట ఏటా ఏప్రిల్ ఏడున భక్తులకు అన్నప్రసాదం అందజేయాలని కోరారు.

సమస్యలపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

అగనంపూడి, జూన్ 24: అగనంపూడి ప్రాంత సమస్యలపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ చర్యలు తీసుకోవాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామఅప్పారావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా బొగ్గు లారీల రాకతో అగనంపూడి, లంకెలపాలెం ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లారీలలో పరిమితికి మించి లోడింగ్ చేస్తున్నందున అవి ప్రయాణించేటప్పుడు బొగ్గు రహదారిపై పడడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడు తున్నారన్నారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు రామ అప్పారావు తెలిపారు.


పీలా మహాలక్ష్మినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గండి బాబ్జీ, తదితరులు

పీలా మహాలక్ష్మినాయుడుకు నివాళి

పెందుర్తి, జూన్ 24: దివంగత మాజీ ఎంపీపీ, టీడీపీ నేత పీలా మహాలక్ష్మీనాయుడు 15వ వర్ధంతిని సోమవారం పాత పెందుర్తి, గవరపాలెం, నల్లక్వారీ, ద్రోణంరాజునగర్, మెట్టజంగాలకాలనీ, మహాలక్ష్మీనగర్‌లో సోమవారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఆయన విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారామణమూర్తి, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, పీలా కృష్ణఅప్పారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పీలా మహాలక్ష్మీనాయుడు విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, టీడీపీ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు, నాయకులు దాడి రమణచిట్టి, శరగడం నరసింహమూర్తి, పి.రాజేంద్రప్రసాద్, కె.రమేశ్, ఎ.రమేశ్, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు

వేపగుంట, జూన్ 24: జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందాయి. పాతగోపాలపట్నం ఎస్సీ కాలనీలో గోడ నిర్మాణం, 92వ వార్డు వెంకటాపురం రామాలయం వద్ద అక్రమ ఇంటి నిర్మాణంపై స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంకటాపురం రోడ్డును తాత్కాలికంగా రాకపోకలు నిలుపుదలతో సమస్యలు, 97వ వార్డులోని చెరువు ఆక్రమణపై చర్యలు చేపట్టాలని శ్రామిక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదుచేశారు. 98వ వార్డు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో నష్టపోయిన తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ బాధితులు ఫిర్యాదు చేశారు. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపించి చర్యలు చేపడతామని అధికారి కె.హేమవతి పేర్కొన్నారు.


సంతోశ్‌నగర్ శివారులో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మత్తు పదార్థాల నిరోధానికి తనిఖీలు

గోపాలపట్నం, జూన్ 24: గంజాయి, మత్తు పదార్థాల రవాణా నియంత్రణకు గోపాలపట్నం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. సీఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా శివారు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగా గంజాయి, మత్తు పదార్థాలు సేవించే ప్రాంతాలను గుర్తించి విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. 89వ వార్డులోని కొత్తపాలెం గ్రామ శివారు, సంతోశ్‌నగర్, ఎల్లపువానిపాలెం రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో గంజాయి సేవించే ఆకతాయిలు గుంపులుగా ఉంటారు. ఈ ప్రాంతాల్లో పోలీసులు రాత్రి వేళల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతాల్లో మద్యం సేవించే యువకులను గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఎస్ఐ రామకృష్ణ నేతృత్వంలో రోజూ 89వ వార్డు గ్రామాల్లో వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ఆటోనగర్‌లో 'స్వచ్ఛతా పక్వాడా' నిర్వహణ


చీపుర్లతో రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశ్రామికవేత్తలు

ఆటోనగర్, జూన్ 24: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ ఎఫ్-బ్లాక్‌లో సోమవారం మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సహకారంతో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలా మాజీ చైర్మన్ ఎన్.శేషగిరిరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న పరిశుభ్రమైన, సుందర భారతదేశం కోసం అందరం కృషి చేస్తామంటూ ఎంఎస్ఎంఈ, ఏపీఐఐసీ, ఐలా, వాసీవా సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంఎస్ఎంఈ కో-ఆర్డినేటర్ చంద్రమౌళి, ప్రభాకర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో వీధులను చీపుర్లతో శుభ్రం చేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావులు కాలుష్య నివారణకు మొక్కలు నాటించడంతో పాటు వాటిని పరిరక్షించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరి చేరవన్నారు. అనంతరం పలువురికి మాస్కులు, సబ్బులు, టోపీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, వాసీవా, ఐలా ప్రతినిధులు పరుచూరి ప్రభాకర్, చీకటి సత్యనారాయణ, ఈ.కృష్ణప్రసాద్, సత్య సర్వశుద్ధి, దామోదర్‌రెడ్డి, రాజు, ఒమ్మి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

సౌత్ ఏసీపీ టి.త్రినాథ్


నృత్య నికేతన్ విద్యార్థులతో ఏసీపీ త్రినాథ్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 24: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కాంపిటేషన్ నృత్య పోటీల్లో నృత్యనికేతన్ విద్యార్థులు 35 మంది పాల్గొని కూచిపూడి నృత్యంలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం టౌన్‌షిప్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ మాట్లాడుతూ చదువుతో పాటు ఇతర రంగాలలోనూ విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రతిభావంతులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డ్యాన్స్ టీచర్ కె.హైమావతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆస్పత్రిలో వైద్య పరికరాలు మాయం?

మల్కాపురం, జూలై 24: శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యూ)లో వైద్యపరికరాలు మాయమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి అపహరణ వెనుక ఆస్పత్రిలో ఒకరిద్దరు సిబ్బంది హస్తం ఉన్నట్టు సమాచారం. గత ప్రభుత్వం ఈ ఆస్పత్రి నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. ఆ వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా స్కాన్ ఆపరేటింగ్ పరికరాలు, ల్యాబ్ పరికరాలు, ఈసీజీ మిషన్‌లు, బెడ్‌షీట్స్, ఈసీజీ/ఆక్సిజన్ సిలిండర్స్‌తో పాటు ఇతరాత్ర సామగ్రి బయటకు తరలించినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని కొందరు స్థానిక ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గణబాబు అధికారులను ఆదేశించారు.

1 నుంచి సీపీఐ రాష్ట్ర స్థాయి సమావేశాలు

మల్కాపురం, జూన్ 24: విశాఖ మురళీనగర్ బీవీ గ్రౌండ్‌లో జూలై ఒకటి నుంచి మూడో తేదీ వరకు సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్టు పశ్చిమ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ తెలిపారు. ఈ మేరకు సోమవారం మల్కాపురంలో పోస్టరు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి సహకారాన్ని అందిస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న నష్టాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, విభజన చట్టంలోని హామీలను పూర్తి చేయడం ద్వారా ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, కనకరాజు, కామేశ్వరరావు, గోపాలరావు, త్రినాథ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 24: రహదారి నిబంధనల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని ఆచరించినప్పుడే ప్రమాదరహిత సమాజాన్ని స్థాపించగలమని గాజువాక ట్రాఫిక్ పోలీసులు అన్నారు. షీలానగర్ మనీషా నర్సింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన రహదారి భద్రతా నిబంధనల అవగాహన కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొని విద్యార్థులకు నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

కూర్మన్నపాలెం, జూన్ 24: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో 46 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం కొత్తమ్మతల్లి వార్షిక పండగ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 15న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ దేవతల కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపాక విశేష అలంకరణ చేశారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం కొత్తమ్మతల్లి ప్రధాన పండగను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, సూరిశెట్టి పెంటారావు, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శంకరరావు, గొనప సన్యాసి నాయుడు, కేవీ నారాయణ, సత్తిబాబు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నర్సుల స్ట్రగుల్ కమిటీ వినతి



వంశీకృష్ణకు వినతి పత్రమిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, జూన్ 24: అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని నర్సుల స్ట్రగుల్ కమిటీ నాయకులు దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కోరారు. సోమవారం కాంట్రాక్స్ నర్సింగ్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి శుభాభినందనలు తెలిపారు. అనంతరం వారి సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సూర్యకళ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి రాష్ట్రంలో నిరుద్యోగులకు ఊరటకలిచిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని తమకూ నారా లోకేశ్ హామీ ఇచ్చారని, ఈ స్థితిలో తమను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు ఈ సమావేశంలో స్టాఫ్ నర్సు శాం తమ్మ, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు రవి, అరుణకుమారి, జ్యోత్స్న, వెంకటదుర్గ, కరుణ, వై. దుర్గ, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవో



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

అక్కయ్యపాలెం, జూన్ 24: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రాన్ని సోమవారం సీతమ్మధార మండలం ఎంఈవో రామారావు సందర్శించారు. ఈ మేరకు వారు దివ్యాంగ విద్యార్థులకు ఏ విధంగా విద్య అందుతుందోనని వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, గీత, ఉపాధ్యాయులు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు.

రిటర్నింగ్ వాల్ పనులను వేగవంతం చేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారావు

కంచరపాలెం, జూన్ 24 : జీవీఎంసీ 48వార్డు పరిధి కొండవాలు గ్రామాలైన నీలకంఠనగర్, రామకృష్ణ నగర్, కొండదేవత గుడి తదితర ప్రాంతాలకు రక్షణగా చేపడుతున్న రిటర్నింగ్ వాల్ పనులను వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు సోమవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరకుండా వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. 40 ఏళ్లుగాబాధిత గ్రామాల ప్రజలు రిటర్నింగ్ వాల్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వీరికిత్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



మహిళను అప్పగిస్తున్న ఏయూటీడీ సెక్రటరీ వాసు

డాబాగార్డెన్స్, జూన్ 24: నిరాశ్రయురాలైన శ్రీకాకుళానికి చెందిన పూజ (28)ను ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చినట్టు ఏయూటీడీ సెక్రటరీ వాసు తెలిపారు. మద్యానికి బానిసై 2016 సంవత్సరం నుంచి రోడ్లపై తిరుగుతున్న ఆమెను ఆదివారం రాత్రి టూ టౌన్ మహిళా ఏఎస్ఐ కాంతం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ వద్ద ఆమెను అదుపులోకి తీసుకున్నారు. పారిపోయే ప్రయత్నంలో తనచేతికి గాయం చేసుకున్నట్టు తెలిపారు. దీంతో టీఎస్సార్ వుమెన్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించి, సోమవారం ఆ మహిళ కుటుంబ సభ్యులను రప్పించి అప్పజెప్పినట్టు ఆయన తెలిపారు. తిరిగి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించినట్టు తెలిపారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

» వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తా..: సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ

అక్కయ్యపాలెం, జూన్ 24: నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 42వ వార్డుకు సంబంధించిన 233, 234 నెంబర్లు గల సచివాలయాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్, సచివాలయాల కార్యదర్శులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వార్డుల్లో సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అకిరెడ్డి జగదీష్ మాట్లాడుతూ వార్డులోని ఇందిరా కాలనీలోని వారికి సామాజిక మరుగుదొడ్లు లేవన్నారు. అలాగే రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, వీటితో పాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, టీడీపీ, బీజేపీ వార్డు అధ్యక్షులు కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్, నాయకులు దువ్వి కాశీప్రసాద్, శ్రీకృష్ణ, ఎంఎల్ఎస్ రావు, జేకే, తోట శ్రీదేవి, శ్రీవేణి, బంగారి నవీన్, ఆర్పీలు ఎస్.అలివేణి పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరం అందేలా సిబ్బంది పని చేయాలని ఎమ్మెల్యే వంశీ కృష్ణ ఆదేశించారు. సోమవారం గ్రేటర్ 38 వార్డు పరిధిలోని బురుజుపేట సచివాలయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సచివాలయాలకు వచ్చే వినతులు పరిష్కరించాలని కోరారు. నియోజవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్- 4 కమిషనర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న వంశీ కృష్ణ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి: ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీసమేతంగా కనకమహాలక్ష్మి అమ్మవారిని సోమవారం ఉదయం దర్శించుకున్నారు. పూర్ణకుంభం, మేళతాళాలతో ఆయనకు అర్చకులు, ఈవో శ్రీనివాసుల రెడ్డి స్వాగతం పలికారు. గర్భగుడిలో అమ్మవారికి పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు. అమ్మవారి ప్రతిమ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూఅమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు గోడి నరసింహాచారి, త్రినాద్, కేథారి లక్ష్మి, జనసేన నాయకులు బుద్దల అనురాధ దేవస్థానం ఇంజనీర్ రమణ, మూర్తి, సహాయకార్యనిర్వహణాధికారి వి. రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు

జ్ఞానాపురం, జూన్ 24: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక నిర్వహించి వినతులు స్వీరించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి 3, పట్టణప్రణాళికా విభాగానికి 3 చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ టి. ఎస్. ఎన్. రాజు, ఈఈలు మృత్యురాజు, తారా ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, టీపీఓ విజయ్‌కుమార్, వైద్యాధికారి సునీల్ కుమార్, ఆర్వోలు బాబురావు, రాజేశ్వరి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో..



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ ఆర్.జి.వి కృష్ణ



దరఖాస్తు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులు పరిష్కారించే దిశలో చర్యలు చేపడతామని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ శ్రీరామమూర్తి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ఈ వేదికలో పలువురినుంచి వినతులు స్వీకరించారు. 2014లో ఇచ్చిన సర్వే సర్టిఫికెట్‌లో అవతకవకలు ఉన్నట్టు ఒకరు ఫిర్యాదు చేయడంతో పరిశీలించి సమస్య పరిష్కారిస్తామన్నారు.



రామకృష్ణానగర్ రోడ్డు మధ్య తవ్విన గొయ్యి



అక్కయ్యపాలెంలో.....

విచ్చలవిడిగా రోడ్లు తవ్వకాలు... రాకపోకలకు అవస్థలు

» అక్కయ్యపాలెం పరిసరాల్లో సమస్య.. పనుల్లో జాప్యంతో తంటాలు

అక్కయ్యపాలెం, జూన్ 24 : అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో రోడ్లను ఇష్టానుసారం తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్లు వేసేందుకు రామకృష్ణానగర్ ఇతరప్రాంతాల్లో రోడ్లను తవ్వకాలు చేపట్టారు. రోజులకొద్దీ పనులు చేయకపోవడం వల్ల తవ్విన గోతులు అలాగే ఉండిపోతున్నాయి. దీంతో తాము గమ్యానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. గోతులను రాత్రి వేళల్లో చూసుకోకుండా వెళ్లి వాటిలో పడి పలువురు గాయాలపాలవుతున్నారు. ఇలాంటి నిర్వహణ పనులు సత్వర చర్యలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

మహారాణిపేట, జూన్ 24: ప్రభుత్వ ఆస్పత్రుల్లో థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విశాఖపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఈమేరకు కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో ప్రకారం కార్మికునికి రూ. 16 వేల వేతనం అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐలు చెల్లింపులో వ్యత్యాసం లేకుండా చూడాలని కోరారు. కార్మికులపై పనిభారం పెంచడం తగదన్నారు. కాంట్రాక్టర్లు పాల్పడుతున్న కక్ష్య సాధింపు చర్యలను నిరోధించాలని కోరారు. విమ్స్, టీబీహెచ్ , మానసిక వైద్యశాలలకు చెందిన వర్కర్స్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు వితరణ

అల్లిపురం, జూన్ 24: చిరువ్యాపారులకు దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు పార్టీ కార్యాలయం వద్ద సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. ఎండా, వర్షంలలో రక్షణగా వ్యాపారులకు వీటిని అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఆదిబాబు, కిషోర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన లైఫ్‌గార్డులు

మహారాణిపేట, జూన్ 24: సముద్రంలో మునిగిపోతున్న మహిళను లైఫ్‌గార్డులు కాపాడారు. సీమ్మధార ప్రాంతానికి చెందిన వి. ప్రవల్లిక (22) ఆమె భర్త అప్పారావుతో కలసి ఆటవిడుపుగా సోమవారం ఆర్‌కే బీచ్‌లో వద్దకు వచ్చి సముద్రంలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో తీరంలో అలల తాకిడికి ప్రవల్లిక లోనికి కొట్టుకుపోయారు. వెంటనే అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్‌గార్డులు కల్యాణ, వెంకటేష్, ధనరాజు చేరుకుని ఆమెను కాపాడారు.

ఆది శంకరాచార్యులు శివుని అవతార రూపం

అక్కయ్యపాలెం, జూన్ 24: ఆది శంకరాచార్యులు సాక్షాత్తు శివుని అవతార రూపమని కుర్తాళం శంకరాచార్యులు సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితా పీఠంలో ప్రవచన కార్యక్రమం సోమవారం రాత్రి జరిగింది. స్వామివారు జగద్గురు శంకరవిజయం అనే అంశంపై అనుగ్రహ భాషణం చేశారు. శంకరుల అవతరణ నాటి కి భారతావనిలో ఉన్న ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జపతప హోమాలను తెలిపారు. శంకరులు అద్వైత సిద్ధాంత ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్రవాఙ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారన్నారు. వారి కవిత్వం బోధనల ప్రభావం నేటికి సమాజంపై ఉందని తెలిపారు. శంకరుల జీవితంలోని పలుఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.



అనుగ్రహణ భాషణ చేస్తున్న సిద్దేశ్వరానందస్వామి

ఏటీఎల్ లక్ష్య సాధనలో హెచ్ఎంలది కీలకపాత్ర: డీఈవో



వర్క్‌షాప్‌లో హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న డీఈఓ చంద్రకళ తదితరులు

వేపగుంట, జూన్ 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) లక్ష్యాలను విద్యార్థులకు చేరవేయడంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని డీఈఓ చంద్రకళ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్‌కు శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 30 పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులల్లో సైన్స్ ప్రాజెక్ట్‌లపై అవగాహన పెంపొందించాలన్నారు. వారి భవిష్యత్తు అభిప్రాయాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా వారిని సిద్ధం చేయాలని కోరారు. అలాగే, సైన్స్ ఎగ్జిబిషన్‌లో జరిగే ప్రతీ ఈవెంట్‌లో ఏటీఎల్ విద్యార్థులు పాల్గొనేలా హెచ్‌ఎంలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, కిషోర్, వెంకటేష్, హేమ, జిల్లా సైన్స్ అధికారి కె. ప్రసాద్, వేపగుంట హెచ్‌ఎం పద్మావతి, ఏపీసీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు

» ముమ్మరంగా వాహన తనిఖీలు

» నెక్స్ జెన్ ఎం పరివాహన్ సిటిజన్ యాప్‌లో జరిమానాల వసూలు

సీతంపేట, జూన్ 24: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమణ, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, పాత చలానాల బకాయిలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నాయి. సిగ్నల్ జంపింగ్, నో హెల్మెట్, త్రిబుల్‌రైడింగ్ ఇలా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి ఈ చలనాలు విధించే వారు. అయితే, వీటిని వాహనదారులు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. అటువంటి వారి వద్ద నుంచి వారి మొబైల్‌లోనే జరిమానా చలానాలు చెల్లించేలా నెక్స్‌జెన్‌ఎం పరివాహన్ సిటిజన్ యాప్ ద్వారా అనుసంధానిస్తున్నారు. ద్వారకా ట్రాఫిక్ సర్కిల్ పరిధి ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ కేఎన్ఎస్‌వీ ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ భాస్కరరావు ప్రత్యేక డ్రైవ్ ద్వారా వాహనదారులతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి జరిమానాలు కట్టిస్తున్నారు. గురుద్వార కూడలి, సీతమ్మధార కూడలి, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. వాహనాల పాత చలనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..: సీఐ

వాహనదారులు తప్పనిసరిగ్గా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ కేఎన్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ప్రత్యేక యాప్‌తో పాత ఈ చలనాలు, జరిమానాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



గురుద్వారా జంక్షన్‌లో జరిమానా కట్టిస్తున్న పోలీసులు

పశ్చిమ గోదావరిపై విశాఖ భారీ ఆధిక్యం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 24: రాష్ట్ర స్థాయి అండర్-16 క్రికెట్ టోర్నీలో విశాఖ ఆటగాళ్లు కదం తొక్కారు. నరసారావుపేటలో పశ్చిమ గోదావరితో జరుగుతున్న మల్టీ డే మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 349 పరుగుల ఆధిక్యత సాధించారు. టాస్ గెలిచి తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన పశ్చిమ గోదావరి 27.1 ఓవర్లలో కేవలం 42 పరుగులకే కుప్పకూలింది. విశాఖ బౌలర్ కే గౌతమ్ ఆర్య ఆరు వికెట్లు తీసి పశ్చిమ గోదావరి బ్యాటర్లను పెవిలియన్ దారి పట్టించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన విశాఖ తొలి రోజు ఆట ముగిసే సరికి 60 ఓవర్లలో రెండు వికెట్లకు 391 పరుగుల భారీ స్కోరు చేసింది. కే భాను శ్రీహర్ష వీరవిహారం చేసి డబుల్ సెంచరీ (209; 29 బౌండరీలు, 7 సిక్సర్లు) సాధించగా, పి.ధీరజ్ భారీ సెంచరీ (157; 22 బౌండరీలు, 2 సిక్సర్లు) చేసాడు. పశ్చిమ గోదావరి బౌలర్లు ఏ దశలోనూ భాను శ్రీహర్ష, ధీరజ్‌లను నిలువరించలేకపోయారు.

నైపుణ్య గణనకు ప్రాధాన్యమివ్వాలి ; కాంగ్రెస్

మురళీనగర్, జూన్ 24 ; ఏపీప ప్రభుత్వం రాష్ట్రంలో యువత సహా అన్ని వర్గాల నైపుణ్య గణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ మూల.వెంకటరావు కోరారు. కుల గణన కంటే ముందుగా దీనికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ అవసరాలను అందుకోవాలంటే, జనాభాకు ఉన్న నైపుణ్యాలను సమర్థంగా అంచనా వేయాల్సి ఉందన్నారు. మొత్తం శ్రామికశక్తి నైపుణ్యాలను, సామర్థ్యాలను సమగ్ర సమాచారం సేకరణతో విధాన రూపకర్తలు సరైన నిర్ణయాలు తీసుకునే వీలుంటుందని అన్నారు. ప్రపంచంలో ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ తదితర దేశాలు అగ్రస్థానాల్లో ఉండటానికి కారణాలు ఇవే అని అన్నారు. ఈ కార్యక్రమంతో ఉత్తమ విద్య వృత్తి శిక్షణకు దారితీస్తుందని అన్నారు.

ఏయూ వీసీ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

సిలబస్ పూర్తిచేస్తే రూ.45 వేలు వేతనంగా చెల్లించేవారు. ఒక్కో సెమిస్టర్ పూర్తి చేయడానికి 90 రోజులు సమయం పడుతుంది. అంటే నెలకు కేవలం రూ.15 వేలు చొప్పున లభించేది. అయినప్పటికీ ఉద్యోగ భద్రత ఉంటుందన్న ఉద్దేశంతో ఎంతో మంది సంవత్సరాల తరబడి పనిచేస్తురు. వీసీ ఒకే ఒక్క కలంపోటుతో వారి జీవితాలను రోడ్డునపడేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తొలగింపునకు గురైన గెస్ట్ ఫ్యాకల్టీ ఇప్పటికీ వర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు. తొలుత కోర్సులను ఎత్తేసిన అధికారులు...ఆ తరువాత కాలంలో కొన్నింటిని మళ్లీ ప్రారంభించారు. అయితే గెస్ట్ ఫ్యాకల్టీని మాత్రం తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలోకి తెచ్చిన ఎయిడెడ్ ఫ్యాకల్టీ, ఇతరులతో ఆయా కోర్సులను నిర్వహిస్తున్నారు.

ఎత్తేయడానికి కారణం అదే..

అడ్మిషన్లు తగ్గాయని, ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజులో కోత విధించిందంటూ కారణాలను చూపించి అధికారులు దశల వారీగా పలు కోర్సులను ఎత్తేచేశారు. ఆయా కోర్సులు ఎత్తేసిన తరువాత గెస్ట్ ఫ్యాకల్టీతో అవసరం లేదంటూ వారిని తొలగించారు. కొన్ని నెలల తరువాత ఎత్తేసిన కొన్ని కోర్సులను మళ్లీ పునః ప్రారంభించారు. దీనికి మీడియాలో పెద్దఎత్తున కథనాలు రావడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. అయితే, తొలగించిన గెస్ట్ ఫ్యాకల్టీని మాత్రం అధికారులు మళ్లీ విధుల్లోకి తీసుకోలేదు. ఆదాయం బాగా వచ్చే కోర్సులను మాత్రమే వర్సిటీలో పెట్టారు. దీనివల్ల సాధారణ, నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అదేవిధంగా ఏళ్ల తరబడి పనిచేస్తూ వచ్చిన ఉద్యోగులు రోడ్డునపడ్డారు.

పెందుర్తిలో కలకలం

... 5వ పేజీ తరువాయి

హల్‌చల్ చేయడంతో పెందుర్తి ఉలిక్కిపడింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఆదివారం రాంపురంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గ స్థాయి పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అందరికీ వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో తెల్లవారేసరికల్లా ఆయన ఆస్పత్రిలో ఉన్నారని వార్తలు రావడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై రకరకాల కథనాలు ప్రచారం జరగడంతో సోమవారం సాయంత్రం ఆయన వీడియో విడుదల చేశారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలు సమయంలో గ్యాస్ట్రిక్ పెయిన్ రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఆస్పత్రిలో చేర్పించారని, ప్రస్తుతం తాను డిశ్చార్జి అయ్యి ఆరోగ్యంగానే ఉన్నానని పేర్కొన్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడని విష ప్రచారం చేశారని అవన్నీ అవాస్తవాలన్నీ కొట్టిపారేశారు.

ఉక్కు కన్సల్టెంట్‌తో చిక్కు

... 5వ పేజీ తరువాయి

చేసిన వారికి ఇంకా ఫైనల్ సెటిల్‌మెంట్ పెండింగ్‌లో ఉండగా ఈయనకు మాత్రం అన్నీ క్లియర్ చేసేశారు. ఫైనాన్స్ విభాగంలో పనిచేయడం వల్ల కీలక సంస్థలు, వ్యక్తులతో సంబంధాలు పెట్టుకొని సొంతంగా లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాంటు కిష్ట పరిస్థితుల్లో ఉన్నందున ఉద్యోగులు, కార్మికులకు జీతాలు ఆపాలని సలహా ఇచ్చిందేకూడా ఆయనేనని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి.

ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఆయన పదవీ విరమణ చేసిన తరువాత ఆ పోస్టు చాలాకాలం ఖాళీగా ఉంచారు. వాస్తవానికి స్టీల్‌ప్లాంటులో డైరెక్టర్ స్థాయి పోస్టు ఖాళీ అవుతుంటే మూడు నెలల ముందుగానే రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించి, సరైన అధికారిని ఎంపిక చేస్తారు. ఈయన విషయంలో అలా చేయలేదు. రిటైరయ్యాక ఆ పోస్టు భర్తీ చేయకుండా సుమారు ఎనిమిది నెలలు ఖాళీగా ఉంచేశారు. ఫైనాన్స్ విభాగాన్ని సీఎండీ కొన్నాళ్లు, పర్సనల్ డైరెక్టర్ కొన్నాళ్లు అదనపు బాధ్యతల కింద చూసుకున్నారు. ఆ సమయంలో సదరు రిటైర్డ్ అధికారి వారి ఛాంబర్లలోనే కూర్చుని ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్-3ను జిందాల్‌కు ఇస్తే ప్లాంటు కష్టాలన్నీ తీరిపోతాయని చెప్పి, వారికి అనుకూలంగా నిర్ణయం వచ్చేలా చేసింది ఈయనేనని, ఇప్పుడు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా రెండు నెలల క్రితం పూర్తిస్థాయి ఫైనాన్స్ డైరెక్టర్‌ను నియమించారు. అదే విభాగంతో డైరెక్టర్ అయ్యేంత అనుభవం ఉన్న చీఫ్ జనరల్ మేనేజర్ ఉన్నారు. అయినప్పటికీ సదరు అధికారిని కన్సల్టెంట్‌గా కొనసాగిస్తున్నారు. ఇది దుబారా వ్యయం కిందికే వస్తుందని, తక్షణమే సలహాదారులను సేవలు నిలిపివేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఇటీవల ప్లాంటు ఆర్థిక స్థితిపై చర్చించడానికి ఉన్నతాధికారుల బృందం ఢిల్లీకి, బ్యాంకర్లతో రుణాల కోసం చర్చించడానికి ముంబై వెళ్లింది. వారితో పాటు ఈయన్ను కూడా తీసుకువెళ్లారు. ఆయనకు సీఎండీ ఎందుకు అంత ప్రాధాన్యం ఇస్తున్నారో ఉద్యోగ, కార్మిక సంఘాలకు అంతుబట్టడం లేదు.

టిడ్కో లబ్ధిదారులపై బ్యాంకుల ఒత్తిడి

... 5వ పేజీ తరువాయి

మంజూరుచేశాయి. ఈ రెండు కేటగిరీలకు చెందిన 11,575 ఇళ్లకు బ్యాంకులు రెండేళ్ల కిందటి నుంచి దశల వారీగా లోన్ మంజూరుచేశాయి. లోన్ మంజూరైన రెండేళ్ల తర్వాత లబ్ధిదారులు నెలవారీ వాయిదాలను చెల్లించాల్సి ఉంటుందని ముందే నిబంధన విధించాయి. రూ.3.15 లక్షలు రుణం తీసుకున్నవారు నెలకు రూ.3 వేలు, రూ.3.65 లక్షలు రుణం తీసుకున్నవారు నెలకు దాదాపు రూ.3,600 ఈఎంఐ కింద చెల్లించాలి. రుణాలు మంజూరు చేసిన తర్వాత జీవీఎంసీ అధికారులు తమ పని అయిపోయిందన్నట్టు చేతులు దులిపేసుకున్నారు. కానీ టిడ్కో అధికారులు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వకకపోవడంతో సమస్య మొదలైంది. ఇంతవరకూ కేవలం 7,500 మందికి మాత్రమే ఇళ్లను అప్పగించారు. ఈలోగా లబ్ధిదారుల్లో కొందరికి బ్యాంకు నుంచి రుణాలు మంజూరై రెండేళ్లు పూర్తయిపోయింది. దీంతో వారు తీసుకున్న లోన్‌కు ఈఎంఐలు కట్టాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించారు. తమకు ఇళ్లు ఇంకా అప్పగించనందున తాము ఈఎంఐ కట్టలేమని లబ్ధిదారులు చెబుతున్నారు. తాము ఒక వైపు ఇంటి అద్దెలు కడుతూ, టిడ్కో ఇళ్లకు వాయిదాలు ఎలా కట్టగలమని బ్యాంకర్లను ప్రశ్నిస్తున్నారు. అయితే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల వివరాలన్నీ బ్యాంకర్ల వద్ద ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాగానే బ్యాంకులు ఆ మొత్తాన్ని తమ వాయిదాల కింద లాగేసుకుంటున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులకు లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తే తాము చేయగలిగిందేమీ లేదంటూ చేతులెత్తేస్తున్నారు. ఇదే విషయమై కొమ్మాది లేఅవుట్‌లో ఇళ్లు పొందిన కొంతమంది లబ్ధిదారులు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సాయికాంత్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన యూసీడీ అధికారులను పిలిచి తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బాధితులు మీడియాకు తమ గోడును వెల్లబోసుకున్నారు.

జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్

... 5వ పేజీ తరువాయి

రైళ్లను కూడా రద్దు చేశారు. అటు విజయవాడ నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఎంపీలు రైళ్ల రద్దు సమస్యను సీరియస్‌గా తీసుకొని, సామాన్య ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే దీనిపై ప్రతి ఎంపీ గొంతు విప్పాల్సిన అవసరం ఉంది.



స్వామివారికి నీరాజనం ఇస్తున్న అర్చకుడు

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూన్ 24 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు.ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో పరిమళభరితపుష్పమాలికలతో, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. నిత్య కల్యాణానికి ముందు సహస్ర నామ తులసీ దళార్చన జరిపారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 10 లక్షల విరాళం

సింహాచలం, జూన్ 24 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు రూ. 10 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అన్నప్రసాద విభాగం ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావుకు సోమవారం ఆయన అందజేశారు.తన సోదరుడు నెక్కింటి వెంకటరత్నం పేరున ఏటా ఏప్రిల్ 7న భక్తులకు అన్నప్రసాదం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

భీమునిపట్నం, జూన్ 24 : జీవీఎంసీ 4వ వార్డు సోమన్నపాలెం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు సోమవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు బోర బంగారురెడ్డి, శీరపు రమణ,నారు ఎల్లాజి, కోడిబోయిన నాయుడు, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, చందక రాఘవ, జనసేన నాయకుడు పాతురపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరంలో...

ఆనందపురం : మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి కె. చలపతి రావు తన సొంత నిధులతో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. 55 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : సింహాచలం మెయిన్ రోడ్డులోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం స్టూడెంట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు.

తోటగరువు హైస్కూల్లో 212 మంది విద్యార్థుల చేరిక

ఆరిలోవ, జూన్ 24 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 212 మంది విద్యార్థులు చేరినట్టు హెచ్‌ఎం దుర్గా భవాని తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తరగతిలో 180 మంది చేరగా, మిగతా తరగతులకు సంబంధించి 32 మంది చేరారన్నారు. గత విద్యా సంవత్సరంలో 400 మంది పదో తరగతి విద్యార్థులు వెళ్లిపోగా 1250 మంది ఉండేవారని, కొత్తగా చేరిన 212 మంది విద్యార్థులతో కలిపి ప్రస్తుతం 1460 మంది ఉన్నారని చెప్పారు. మరో 300 మంది వరకు చేరే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయుల కొరత లేదని, విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందించామని ఆమె తెలిపారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఓఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 64, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారెట్ 38, దొండకాయలు 28, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 150, అల్లం (పాతది) 160, బరబటి 58, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180,కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 38, కీరదోస 38, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రారంభం

- తొలి రోజు విశేష స్పందన
- మూడు నెలలు తరువాత పునఃప్రారంభం



భీమిలిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు

భీమునిపట్నం, జూన్ 24 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒకే ఒక అర్జీ అందింది. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి వినతి అందినట్టు కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జోన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ డి. శ్రీనివాసరావు, ఏఈ సుమన్, ఆర్ఓ నరసింగరావు, యూసీడీ ఏపీవో సంతోష్, ఏఎంహెచ్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పద్మనాభంలో ఐదు వినతులు

పద్మనాభం : తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చాయి. తహసీల్దారు వెంకటరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ వీఆర్వోలు ప్రజల నుంచి వినతులు స్వీకరించి మూడు రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు యోగి, ఆర్ఐ కోటి పాల్గొన్నారు.

కొమ్మాది : జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు తొమ్మిది వినతులు అందినట్టు జడ్సీ శైలజా తెలిపారు. చంద్రంపాలెంలో తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ దుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యుడు పిళ్లా సూరిబాబు వినతిపత్రం ఇవ్వగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, తాగునీటి విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 1 వినతి అందినట్టు చెప్పారు.

బోట్ల నష్టపరిహారం ఇప్పించండి



వంశీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకార నాయకులు

మద్దిలపాలెం, జూన్ 24 : ప్రభుత్వం షిప్పింగ్ బోట్ల పరిహారానికి జీవో 369 ద్వారా విడుదల చేసిన రూ.1.05 కోట్ల నిధులు యజమానులకు అందివ్వడానికి చర్యలు తీసుకోవాలని మత్స్యకార నాయకులు కోరారు. సోమవారం వారు శివాజీపాలెంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీ రామ్ మాట్లాడుతూ 2017-20 వరకు 300 ఫిషింగ్ బోట్లకు రూ.2.77 కోట్ల డీజిల్ రాయితీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. అలాగే ఈనెల 17న అగ్ని ప్రమాదానికి గురైన బోటుకు రూ. 20.50 లక్షల పరిహారం అందించాలన్నారు. వీటితో పాటు మత్స్యకార సమస్యలు, వారికి ఇవ్వాల్సిన పరిహారం, రాయితీ బకాయిల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనిపై వంశీకృష్ణ సానుకూలంగా స్పందించారు.

లోకేశ్‌ను కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నేత ప్రణవ్



ఎంవీపీ కాలనీ, జూన్ 24 : విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ను టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ సోమవారం అమరావతిలో కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, కూడా ఉన్నారు.

140 మంది నేత్ర వైద్య పరీక్షలు

పెదవాల్తేరు, జూన్ 24 : పిఠాపురం కాలనీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబి రం నిర్వహించారు. బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఈ శిబిరాన్ని ప్రారంభిం చారు. వైద్యులు 140 మంది రోగులకు పరీక్షలు చేసి, కొందరిని శస్త్ర చికిత్స ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంఎం మహేష్, పూర్వ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, మేనేజర్ హరిష్, మాణిక్యాలరావు, లయన్ శ్రీనివాసరావు, ఉగ్గిన తారా మసీదు అధ్యక్షుడు ఎంఏ రజాక్, నగూర్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద ఎమ్మెల్యే లలితకుమారి

సింహాచలం, జూన్ 24 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. ఎమ్మెల్యేలకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాస మూర్తి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ఎమ్మెల్యేల గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి వేదాశీర్వచనాలను, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

'విదేశీ పక్షుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి'

తగరపువలస, జూన్ 24 : తగరపువలస, భీమిలి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చిల్లపేట చెరువు వద్ద విదేశీ పక్షుల విడిది కోసం ఆవాసాలు ఏర్పాటు చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన పర్యాటక శాఖాధికారులకు వినతిపత్రం అందించారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా సైబీరియా పక్షులు ఈ ప్రాంతానికి వస్తున్నాయని చెప్పారు. వాటి నివాసం కోసం చెరువు వద్ద సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు.

సాగర్‌నగర్ బీచ్‌లో అంధకారం

సాగర్‌నగర్, జూన్ 24 : సాగర్‌నగర్ బీచ్‌లో అంధకారం నెలకొంది. బీచ్‌లో కొబ్బరి మొక్కలు నాటి, వాటి మధ్య సందర్శకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. కొబ్బరి మొక్కలకు, బీచ్ రోడ్డు నుంచి బీచ్‌కు వచ్చే దారి పొడవునా విద్యుత్ దీపాలు అమర్చారు. అయితే విద్యుత్ దీపాలు వెలగడం వల్ల ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పొదగడం లేదని అటవీ శాఖాధికారులు విద్యుత్ లైట్లను ఆపాలని చెప్పడంతో జీవీఎంసీ విద్యుత్ విభాగం వాటిని తొలగించినట్టు తెలిసింది. దీంతో బీచ్‌లో అంధకారం నెలకొనడంతో సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొబ్బరి మొక్కల మధ్య కట్ల పాములు సంచరిస్తున్నాయి. ఇవి చాలా విషపూరితం. చీకట్లో వాటిపై కాలు వేస్తే కాటువేసే ప్రమాదం వుంది. ఎటువంటి ప్రమాదం జరగ ముందే బీచ్‌లో కనీసం ఒకటో రెండో విద్యుత్ దీపాలను వెలిగేలా ఏర్పాట్లు చేయాలని సందర్శకులతో పాటు సాగర్‌నగర్ వాసులు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి : ముత్తంశెట్టి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూన్ 24 : వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోనే వుండి, సమస్యలపై పోరాటం చేయా లని భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం రాత్రి ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ రంగంలోనైనా గెలుపోటములు సహజమని, ప్రజలకు నిరంతరం సేవ చేస్తే మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకురావచ్చన్నారు. నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లవుడు అండగా వుంటానని, పార్టీ తొలినాళ్లలో ఏవిధంగా కష్టపడి పనిచేసారో, అంతకు రెట్టింపు ఉత్సాహంతో శ్రమించాలని పిలుపునిచ్చారు. అధికారంలో లేమని కృంగిపోవనవసరం లేదని, ప్రజాస్వామ్యంలో ఇవి సాధారణంగా జరిగేవేనన్నారు. సమావేశంలో ముత్తంశెట్టి మహేష్, పద్మనాభం ఎంపీపీ రాంబాబు, నాయకులు కోరాడ లక్ష్మణ, కోరాడ వెంకటరావు, పాల రమణారెడ్డి, వాసుపల్లి కొండబాబు, సమ్మిడి శ్రీనివాసరావు, కర్రోతు నాగేంద్ర, రోశిరెడ్డి, పిన్నింటి వెంకటరమణ, జీరు పద్మ, మేరుగు చిన్నారావు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



బిందెలతో నీరు తీసుకువెళ్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) అమ్మవారు

వెంకోజీపాలెం, జూన్ 24 : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో నెలకొల్పిన విజయదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి గణపతి పూజ, 501 బిందెలతో జలాభిషేకం, రక్షా సూత్రధారణ, మండపారాధన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కృష్ణమూర్తి, శంకర్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పరశురామ్ పాత్రో జయంతి

వెంకోజీపాలెం, జూన్ 24 : ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర విద్యా శాఖా మంత్రి, ఒడిశా రాష్ట్ర తొలి అసెంబ్లీ స్పీకర్, ఏయూను విశాఖలో స్థాపించిన సర్ రావు బహదూర్ అన్నెపు పరశురామ్ పాత్రో జయంతి సోమవారం ఏయూలో ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర విద్యా ప్రదాత పరశురాం పాత్రో అని కొనియాడారు ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, హైదరాబాద్ కళింగ అసోసియేషన్ అధ్య క్షుడు బొడ్డేపల్లి శ్రీరామ్, పరశురామ్ పాత్రో ముని మనమడు గ్రూప్ 1 అధికారి రవి, ఆచార్య హరిప్రకాష్, ఆచార్య గురుగుబల్లి సుదర్శన్, ఏయూ దూరవిద్య అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాలపై విచారణ జరపాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

భీమునిపట్నం/మధురవాడ, జూన్ 24 : జీవీఎంసీ ఏడో వార్డులోని మానం ఆంజనేయనగర్‌లో కొందరు నకిలీ పట్టాలతో దందా చేస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కోరారు. సోమవారం వారు భీమిలిలో ఆర్డీఓ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడలోని సర్వే నంబరు 125/పి, 126/2లో 1998లో అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ప్రతిపాదనలతో ఎమ్మెల్యే పల్లా సింహాచలం సూచన మేరకు 140 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. వుడా లేఅవుట్ ప్లాన్‌తో 140 పట్టాలతో మొత్తం 325 పట్టాలుగా అనుమతి పొంది లేఅవుట్ వేశారని చెప్పారు. చాలా కాలం అక్కడ వసతులు లేక ఎవరూ ఇళ్లు నిర్మించకపోవడంతో అప్పటి కలెక్టర్ 325 పట్టాలను రద్దు చేశారని, దీంతో లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించడంతో అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. మధురవాడ, మల్లయ్యపాలెం గ్రామాలకు చెందిన వారు అక్కడ ఇళ్లు నిర్మించుకోగా, నగరం నుంచి వచ్చిన వారు స్థలాలు అమ్ముకోవడంతో ఇతర జిల్లాల వారు అనధికారికంగా కొనుగోలు చేసుకున్నారని చెప్పారు. ఆ విధంగా పొరుగు జిల్లాకు చెందిన సురేష్ అనే వ్యక్తి స్థలం కొనుగోలు చేయడమే కాకుండా ఖాళీగా వున్న మిగిలిన స్థలాలకు, కార్నర్ బిట్‌లకు నకిలీ పట్టాలు సృష్టించి అక్రమంగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై విచారణ జరిపాలని వారు కోరారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న పాఠశాల సముదాయ కమిటీ చైర్మన్ మురళీమోహన్

భీమునిపట్నం, జూన్ 24 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎంఈఓ-1 ఎం. శివరాణి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే వుండాలన్నది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకు మండల కమిటీని నియమించారు. కమిటీకి కన్వీనరుగా ఎంఈవో శివరాణి, చైర్మన్‌గా ఎంపీడీఓ జానకి, సభ్యులుగా తహసీల్దార్ గోవింద, ఐసీడీఎస్ భీమిలి సీడీపీవో శ్రీదేవి, ఏఎస్‌డబ్ల్యూవో రమాదేవి, పాఠశాల సముదాయ కమిటీ చైర్మన్ మురళీమోహన్, కేజీబీవీ ప్రత్యేకాధికారి గంగాకుమారి ఉంటారన్నారు. కమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 24వ తేదీ నాటికి బడిఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. తహసీల్దార్ గోవింద్, ఎంఈవో-2 జయప్రద మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతానికి ఉపాధ్యాయులు, సచివాలయం ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సహకరించాలని కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు.



క్లాత్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న జడ్జి నాగేశ్వరరావు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

భీమునిపట్నం, జూన్ 24 : పట్టణానికి చెందిన ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపల్ జూనియరు సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సోమవారం ఘనం గా జరిగింది. ఈ సందర్భంగా కోర్టు ప్రిన్సిపల్ జూనియరు సివిల్ జడ్జి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. అలాగే పాలిథిన్ వాడకాన్ని తగ్గించాలని, వాటి స్థానంలో క్లాత్ బ్యాగ్‌లు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురికి క్లాత్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనరు డాక్టర్ పింగళి ఆనంద్‌కుమార్, సభ్యులు అడ్వకేట్ పి. మంజుల, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ పార్వతీశం, కేఎస్ఎం సుధాకర్, న్యాయవాదులు పప్పు భరద్వజ, శివ, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



పలకలు లేని కల్వర్టు

ఆరిలోవ, జూన్ 24 : జీవీఎంసీ 12వవార్డు సాలిపేట సమీపంలో ఉన్న కొండవాలు ప్రాంతంలో ఈశ్వరదేవీ నగర్‌లో కల్వర్టు పలక విరిగి ప్రమాదకరంగా ఉంది. సుమారు 15 రోజుల నుంచి ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.కల్వర్టుపై పలక లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు రాత్రి వేళ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమునిపట్నం, జూన్ 24 : జీవీఎంసీ 3వ వార్డు నెహ్రూ రోడ్‌లో వున్న మునిసిపల్ హైస్కూల్‌లో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సస్ దంత వైద్య కళాశాల పీజీ, ఇంటర్న్ డెంటల్ వైద్యులు 240 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. దంత సమస్యలున్న వారిని గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చెట్టి సింహాచలం, ఏఎన్ఐడీఎస్ వైద్యులు ప్రహర్ష, విపిన్, కీర్తన, మనీషా, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రామకృష్ణ, నయీమ్, సుజాత కుమారి, లావణ్య, లక్ష్మి, వెంకటరావు పాల్గొన్నారు.

వంట పాత్రలు వితరణ

ఎండాడ, జూన్ 24 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ సోమవారం వంట పాత్రలను వితరణగా అందజేశారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి కొన్ని వంట పాత్రలు లేకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వారు శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన తన సొంత నిధులతో వంట పాత్రలు కొనుగోలు చేసి ఇచ్చారు.

గారిపేట మసీదులో చందనం సమర్పణ



చందన సమర్పణకు ఊరేగింపుగా వెళుతున్న ట్రస్టు సభ్యులు

కొమ్మాది, జూన్ 24 : కొమ్మాది దరి ముక్తియార్ హజరత్ అలీ ఆశ్రమం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం భీమిలి క్రాస్ రోడ్డు గారిపేట మసీదులో ముక్తియార్ హజరత్‌కు చందనం సమర్పించారు. ఉదయం వల్లీనగర్‌లోని ఆశ్రమం నుంచి క్రాస్ రోడ్డు వరకు థింసా నృత్యాలు, తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం, డ్యాన్సింగ్ గుర్రాలతో భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమలో ట్రస్టు సభ్యులు బాషా, సుభాని, సుధీర్, తాజ్ జలాల్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తగరపువలస, జూన్ 24 : భీమిలి ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి తగరపువలస వైఎస్ఆర్ కూడలి వద్ద ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాల మీద వెళ్లేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎలా జరుగుతాయన్న విషయాలను తెరపై చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

తునివలసలో ఆక్రమణలు తొలగింపు

పద్మనాభం, జూన్ 24 : మండలంలోని తునివలస గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్, రైతు భరోసా కేంద్రం సమీపంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ప్రభుత్వానికి చెందిన స్థలంలో పాకలు, షెడ్లు నిర్మించారని ఫిర్యాదు రావడంతో తహసీల్దారు వెంకటరావు ఆదేశాల మేరకు వీఆర్వో, ఆర్ఐ కోటి తదితరులు విచారణ జరిపి ఆక్రమణలను పొక్లెయినరుతో తొలగించారు.

27 నుంచి హస్త కళా ప్రదర్శన

రామ్‌నగర్, జూన్ 24 : రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో ఈనెల 27 నుంచి హస్త కళా ప్రదర్శన నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ మణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.